# భాగ్యం !

శ్రీ కె. జి. ఆచార్య

తోటమాలి వెంకడు, తోటలో బోదెల్ని తదేక ధ్యానంతో త్రవ్వుతూన్నాడు. అంతలోనే బూట్సు 'టిక్కు టక్కు' చప్పుడు వినబడటంచేత, వెనక్కి తిరిగి చూచాడు. కోటూ, బూటూ, హేటూ, వేసుకుని, చేతిలో ఓ సంచి ఒకటి పట్టుకుని, ఆధునికి విద్యాధికుడు లాగ వున్న ఒక యువకుడు, తనవైపే వస్తూండడం కనబడింది. వెంటనే లేచి నిలబడి,ఆయన తన దగ్గిరకంటూ వచ్చాక, చేతులు జోడించి నమస్కరిస్తూ, 'బాబయ్యా గారూ, తమ రెవరో తెలియనందుకు క్షమించండి!' అని అన్నాడు వినయంగా.

ఆ యువకుడు చిరునవ్వునవ్వుతూ,'ఏమోయ్ వెంకా! నువ్వు నాలుగేళ్ల క్రితం జగ్గరాజు జమీందారుగారి దగ్గిర పనిచేస్తూండేవాడివి గదూ? జ్ఞాపకం వుందా?' అన్నాడు.

'జ్ఞాపకం లేకేమండి బాబయ్యా! నేనా మంచి రోజుల్నీ, ఆ మహాత్ముణ్ణీ, యెప్పటికైనా మరచిపోగలనా? గొప్పవారై వుండీగూడా, తమ జీవితాన్నంతా సుఖభోగాలు అనుభవించడంలోనే గడపకుండా, యెల్లప్పుడూగూడా మాబోటి అన్నంలేక అల్లల్లాడి పోతూండే వాళ్లనీ, కష్టజీవుల్నీ ఆదరించడంలోనే గడిపిన ఆ మారాజుని మరిచిపోతానా బాబయ్యా? అలాంటి దొరయింకెక్కడా లేదండి!'

'వారు చనిపోయేడనే సంగతి నీకు తెలుసా?'

'ఆఁ! తెలిసింది స్వామి! అదేమి మాయదారి,జబ్బో గాని బాబు, విదేశానికి వెళ్లి అక్కడి మందు మాకు తిన్నాగూడా నయం గాలేదుట! ఏం చేస్తాం? ఆ దేముడి దయ అలావుంది! మంచి ప్రభువుల్నిగూడా తొందరగా తనవద్దకు తీసుకుపోతున్నాడు!......... ఏమండీ బాబయ్యా! తమరు రాజుగారి బందుగులా?'

'కాదు, నేను వారి ప్లీడర్ని. వారు తమ అంత్యకాలంలో ఓ వీలు నామా ఒకటి వ్రాశారు. దాన్లో......'

'అవునటండి! ఇక్కడి పిల్లల బడికిగూడా కొంత డబ్బు వ్రాసియిచ్చారని తెలిసింది! వారు యెల్లప్పుడూ బీద పిల్లలకి బాగా చదువు చెప్పించాలని కుతూహల పడుతూండేవారు!.........'

'అవును, నువ్వు చెప్పింది నిజమే! దాంతోబాటు, నువ్వు వారికి చేసిన సేవకు ప్రతిఫలంగా యీ రూపాయల్ని నీ కిమ్మనిగూడా వ్రాశారు. ఇదిగో తీసుకో! ఈ ముసలితనంలో నీకు నిశ్చింతగా కాలక్షేపం గడుస్తుంది!' అంటూ ఆ ప్లీడరు సంచి ఉన్న ఆ చేతిని వెంకడివైపు సాచాడు!

ఆ మాట తన చెవులో బడేసరికి వెంకడికి పిచ్చెత్తినట్లయింది. ఆకస్మికానందంచేత! ఒక్క క్షణంవరకూ అతడు తనమనస్సుని స్వాధీనంలో వుంచుకోలేక పోయాడు! తాను చూస్తూన్నది నిజమో,స్వప్నమోగూడా, అతని కా ఘడియలో గోచరం గాకపోవడంచేత, హృదయంలో రైళ్లు జోరునా పరుగెత్తినట్లయింది! తనకీ భాగ్యం యిలా అకస్మాత్తుగా — తలవనితలంపుగా— లభిస్తుందని, వెంకడు స్వప్నంలోగూడా తలచలేదు. కొంతసేపటికి, వెంకడు తన మనస్సును కుదుటపరచుకొని, మళ్లీ ఆ ప్లీడరుగారికి నమస్కరించి, కంపించిపోతూన్న చేతుల్తో ఆ సంచిని తీసుకున్నాడు! అంతకీగూడా తన సందేహం తీరకపోవడంచేత, సంచివిప్పి రూపాయల్ని చూచి, 'బాబయ్యా, యెన్ని రూపాయలున్నాయో దీంట్లో! అని అడిగాడు.

'రెండువేలున్నాయి! అయినా లెఖ్ఖపెట్టియిస్తా, వుండు.' అంటూ ఆ ప్లీడరుగారు, అవన్నీ లెఖ్ఖపెట్టి

యిచ్చి, అతనికి ముట్టినట్టుగా రసీదు పుచ్చుకుని వెళ్లిపోయాడు!

★

వెంకడి మానసిక నేత్రాలకు, గడిచిపోయిన అతని యవ్వన జీవితంలోని వివిధ విషయాలూ తెరమీద బొమ్మల్లాగ కనబడడం ప్రారంభించాయి! చిన్నప్పట్నుంచీ నాలుగేళ్ల క్రితం వరకూ, అంటే—జీవితంలోని మూడు వంతుల భాగాన్ని—రామరాజు జమీందారుగారి సేవలోనే సలక్షణంగా గడిపాడు. వారిదగ్గిర నౌకరీ చేస్తూ, వారివల్ల నెలకు ముప్పైరూపాయలు చొప్పున జీతం పొందడమేగాకుండా, ఆ జమీందారుగారి బలవంతం మీద రాత్రిళ్లు బడిలోకి వెళ్లి, కొంత మంది చదువును గూడా సంపాదించుకున్నాడు. ఆ జమీందారుగారి దగ్గిర విశ్వాసపూర్ణమైన సేవ జేసినంతవరకూ, వారి యొక్క ప్రత్యేకదయకు పాత్రుడయ్యేడు! అంచేత ఆ రోజుల్లో వెంకడికి అధికంగా జీతంగూడా ప్రాప్తిస్తున్నా, అప్పుడా యవ్వనజీవితంలో వుండే ఉత్సాహోత్తేజాలచేత, ఆ జబ్బుతో కట్టుకున్న పెళ్లానికైనా, నగలూ నాణేలూ చేయించాలని తలంచకుండా, కేవలం మజాగా,—ఖర్చుపెడుతూండేవాడు. ఆఖరికి కొంత కాలానికి, అంటే, నాలుగేళ్లక్రితం దురదృష్టవశాత్తూ, ఆ జమీందారుకు క్షయరోగం రావడమూ, అది యిక్కడి వైద్యుల మందుమాకులకి సుతరామూ నయం గాకపోవడంవల్ల, చికిత్సకోసరం ఆయన విదేశానికి వెళ్లడమూ తటస్థించింది! అంచేత ఆ జమీందారుగారి బంధువు ఒకడు, వారి యింటినీ, జమీనునూ చూస్తూవుండేవాడు అతను నౌకర్లకు నానాబాధలూ పెడుతూండడంచేత, వెంకడు ఆ జమీందారుగారి నౌకరీని వదిలివేయవలసి వచ్చింది!

కొంతకాలం పనేదీ లేకపోవడంచేత, వూరికే కాలం గడిపినతర్వాత, యిప్పుడు చేస్తూన్న తోటమాలి నౌకరీ ప్రాప్తించింది. ఈ క్రొత్త యజమానితోట సుమారు రెండుమూడు యెకరాలుంటుంది! దాంట్లో మామిడి, పనస, నారింజ, నిమ్మ, దానిమ్మ మొదలైన పెద్దపెద్ద ఫలవృక్షజాతులు చాలా వున్నాయి! ఆ తోటలో తూర్పుదిక్కున ఓ మూలలో వెంకడికి, వుండేటందుకు ఓ చిన్న పూరిగుడిసె ఒకటి వుంది! అతని కిప్పుడు పెళ్లాం బిడ్డలూ—యెవ్వరూ లేకపోవడంచేత, ఆ చిన్ని గుడిసెలోనే కాలం గడుపుతుంటున్నాడు. దానికి కొద్ది దూరంలోనే, ఆ తోట యజమాని వుంటూన్న ఓ చిన్న పెంకుటిల్లుగూడా వుంది. ప్రస్తుతం యీ తోటలో వెంకడికి ప్రతిరోజూ తెల్లవారుఝాము మొదలుకొని సాయంత్రం చీకటి పడేటంతవరకూ—తీవ్ర పరిశ్రమ చేయవలసి వస్తోంది! కాని యింత కఠినంగా కష్టపడుతూన్నందుకు ఫలితంగూడా ఆ యజమానినుంచి నెలకు పదిరూపాయలు మాత్రమే దొరుకుతున్నాయి! ఇప్పుడు వెంకడి యౌవనంగూడా పోవడంచేత, అతనికి యింతగా అధిక పరిశ్రమచేయడం, చాలా కష్టమనిపిస్తోంది! అటువంటి అవస్థలో రెండువేలు రూపాయలు, అకస్మాత్తుగా — తలవనితలంపుగా — లభిస్తే, అతనికి యెందుకు అపరిమితానందం గలుగదు? వెంకడు మనస్సులోనే ఆ పరమేశ్వరునికీ, ఆ జమీందారుగారికీ ధన్యవాదాలర్పించాడు! విశ్రాంతి పూర్ణమైన భావికాల సుఖస్వప్నాన్ని కళ్లారా చూడ ప్రారంభించాడు!

★

వృక్షచ్ఛాయలు మెల్లమెల్లగా పొడుగవడం ప్రారంభించాయి. సూర్యభగవానుడు, ఇంత దీర్ఘసంచారంలో తనకు గలిగిన అలసట తీర్చుకోవడంకోసరం గాబోలు, గబగబ పరుగెత్తుకుపోతున్నాడు పశ్చిమాంబుధిలోనికి!

వెంకడు, తనకు ప్రాప్తించిన యీ రూపాయల్ని యెక్కడ భద్రంగా దాచుకోవాలనే ఆలోచనలోపడ్డాడు. అతని పూరిగుడిసె, రక్షణకుతగ్గ ప్రదేశం కానే కాదు. దానిలో ఓ పెట్టె లేదు సరిగదా, ఆఖరికా యింటికి ఓమంచి తలుపుగూడా లేదు; అంతేగాకుండా ఆ తోట యజమాని కొడుకు—పన్నెండేళ్ల పెంకెకుఱ్ఱాడు. యెల్లప్పుడూ ఆ గుడిసెలోదూరి, అన్నీ చక్కబెడుతూవుంటాడు! అంచేత వెంకడు, వీటిని తన గుడిసెలోమాత్రం దాచకుండా, యీరాత్రికి మటుకు యెలాగో యెవ్వరికీ తెలియని, యింకోచోట దాచి రేప్పొద్దున్నే ఆ తోట యజమానికి యేదో సాకుచెప్పి, యింకో వూరువెళ్లిపోయి, అక్కడ జీవితశేషాన్ని సుఖంగా గడుపుకోవడమే మంచిదని నిశ్చయించుకున్నాడు!

ఆ తోటకు పడమటిభాగంలో, కొన్ని పెద్దపెద్ద మామిడిచెట్లమధ్యన యెండిపోయిన చెట్టొకటుంది! దానికో తొర్రగూడావుంది. వెంకడు యెవ్వరూ లేకుండా వుండడంచూచి, ఆ చెట్టెక్కి సంచిని ఆ తొర్రలో భద్రంగా దాచి, దిగి వెళ్లిపోయాడు!

కాని వెంకడికి తెలియకుండా ఆ తోట యజమాని కొడుకు మాత్రం యిదంతా చూస్తూనేవున్నాడు. ఆ కుర్రాడు మామిడికాయలకోసం వచ్చి, కాయల్ని వెదుకుతూ, వెంకడు ఆ యెండిపోయిన చెట్టెక్కడంచూచి చాలా సందేహించాడు! వెంటనే ఆ చెట్టుచాటున దాక్కొని వెంకడు యేదో బరువుగావున్న సంచి తొర్రలో పెట్టడమూ, అంతా బాగా కనిపెట్టాడు! వెంకడు అక్కడ్నుంచి వెళ్లిపోయినతర్వాత ఆ గడుసు కుర్రాడు ఆ చెట్టెక్కి తొర్రలో సంచి చూశాడు. దానినిండా రూపాయలున్నాయని తెలుసుకోగానే, వాడికి గలిగిన ఆనందానికి హద్దులేకపోయింది! వెంటనే ఆ రూపాయల సంచిని చేతబట్టుకొని, చెట్టుదిగి, గప్ చిప్ గా యింటికి పరుగెత్తాడు.

అప్పుడే ఆ కుర్రాడితండ్రి, యింటి గుమ్మంలో కూర్చొని వున్నాడు. వీడి హడావిడీ, ఆ చేతిలోని సంచీ, అంతాచూచి 'ఏమిట్రా అది?' అని అడిగాడు.

గట్టిగా మాట్లాడవద్దని సైగచేస్తూ, లోపలికి రమ్మని తీసుకువెళ్లి, ఆ సంచిని తండ్రిచేతికిస్తూ, వెంకడీసంచిని ఓ చోట దాచుకున్నాడనీ, దాన్ని తా నెత్తుకొచ్చాననీ చెప్పాడు సంతోషంతో గంతులేస్తూ!

అప్పుడు ఆ యజమానికిగూడా అమితానందం గలిగింది! 'బహుశా వా డెక్కడో యీ రూపాయల్ని దొంగిలించివుంటా'డని అంటూ యింట్లోగదిలోకి తీసుకుపోయి దాచాడు కొంత సేపటివరకూ. తర్వాత యెక్కడికో వెళ్లి ఆ సంచిని భద్రంగా దాచివచ్చాడు! తర్వాత యీ విషయాన్నిగురించి తండ్రి కొడుకుల్లో సంభాషణ యేమీ జరగలేదు!

రాత్రి భోంచేసి పడుకునే సమయంలో, వెంకడు తోట యజమానిదగ్గిరకు వచ్చి అన్నాడు: 'బాబుగారూ! కొంచెం తొందరపనిమీద మా సుబ్బిగాడివూరు వెళ్లాల్సివొచ్చింది. తిరిగి రావడం చాలా ఆలస్యంగూడా అవుతుంది. అంచేత నా కియ్యాల్సిన జీతం డబ్బులు యిచ్చేసేయండి, రేప్పొద్దున్నే వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.'

'అంత తొందరపని ఉందాయేమిటి?' అని అడిగాడు. 'అవునండి. తొందరగా రమ్మని వాడిదగ్గర్నుంచి వుత్తరంగూడా వొచ్చింది. తప్పకుండా వెళ్ళాలి!'

'వెళ్లితే వెళ్లుగానీ, రావడంమాత్రం తొందరగా వచ్చేసేయ్! ఎందుకంటే, నువ్విప్పుడు చాలా ముసలాడివై పోతున్నావు! నీకిక యిప్పుడెక్కడా నెలకు పది రూపాయల డబ్బులకంటే యెక్కువ దొరకవు. అంచేత యిప్పుడు, యీ నౌకరీగూడా లేకుండా జేసుకోకు! రేప్పొద్దున్నే డబ్బిస్తాను. వచ్చి తీసుకువెళ్లు!' అన్నాడు.

'చిత్తం!' అంటూ వెంకడు తన గుడిసెకు వెళ్లిపోయాడు.

☆

మర్నాడు ప్రొద్దున్నే, వెంకడువచ్చి, యజమాని దగ్గిర తనకు రావల్సిన రూపాయలు తీసుకొని, బట్ట కొంగున ముడి తగిలించి, ఆ కర్రను భుజాన్ని వేసుకొని ప్రయాణమై వెళ్లిపోయాడు!

ఓ అరగంట అయిన తర్వాత, ఆ గడుసు కుర్రాడు తండ్రితో అన్నాడు, 'బాబా, వెంకడికి మా బాగా అయిందిగదూ?.........అయితే, మనం ఆ రూపాయల సంచి తీసుకున్నామని వాడు పోలీసోళ్ళకి చెప్పి, మనల్ని దడిపిస్తేనో!.........'

'అరే, యేమీ భయంలేదురా! యిక వాడికి యీ సంచి దొరుకుతుందా యేమిటీ? కొంతసేపు గడిచిందంటే, ఆ సంచి మనదన్నమాటే!.........ఆ సంచిని యెవ్వరికీ తెలియని చోట్లో దాచాను నేను!......'.

'ఎక్కడ బాబా!'

'జాగర్త! ఎవ్వరితోనూ చెప్పకు. అదిగో తోటకు ఆ పడమటి మూలగా యెండిపోయిన చెట్టొకటుంది చూచావూ, దాని తొర్రలో!'

'అయ్యో, అయ్యో! నేనక్కడ్నించే ఆ సంచిని తీసుకువచ్చానే!.........దాంట్లోనే వెంకడు దాచుకున్నాడు!'.........మొదటే నా కెందుకు చెప్పేవు కాదూ?.........ఈపాటికి అప్పుడే వెంకడు ఆ సంచిని తీసుకుపోయే వుంటాడు!!.........'